# మరణించాలని..........

రచన: శ్రీ "వి. బి."

అవును. ఈ పాడు ప్రపంచంలో, పరిపూర్ణ స్వార్థ వాతావరణంలో, భయంకరమైన నెత్తుటేరుల మధ్య ఏనిముషానికి ఏముంచ్చి పడ్తుందోననే విపరీతమైన హృదయావేదనతో ఎల్లప్పుడూ కుమిలి కృశించే కన్నా ఒకేసారి ఈ నరకలోకంనుండి విడిపడటం మేలు. ఈ బొందెలోని సుక్కుడు జీవాలు విడిచిపెడితే ఏ విధమైన బాధలుగాని, ఏ విధమైన ఆశలుగాని ఉండవు. ఒట్టి పుణ్యానికి మనమీ పాడు వాతావరణంలో నలిగిపోవాలా ?

కాదు, తప్పదు. తక్షణమే జీవాలనే రీతినైనా విడిచి ఆత్మకు శాంతి, శాశ్వతమైనా విశ్రాంతి, చేకూర్చి అశాశ్వతమైన విభ్రాంతిని పోగొట్టు కోవటం చేస్తాను.

ఆ...ఆ...ఆ...జీవాలు విడవాలంటే మన పెద్దలేగదూ ! నాలుగు మార్గాలు బోధించారు. అగ్ని......జల......రజ్జు...విషాలు.

అబ్బో ! ఆ యగ్నితో ప్రాణం విడిచిపెట్టాలంటే ఆయన సాయంతో చనిపోవాలంటే సామాన్యమైన పనేనా......?

నాలుకలు చాచుకొని తనకు దొరకిన ఏవస్తువునైనా భస్మీపటలం చేయటానికి చేతులు చాచుకొంటూ యరుదెంచే ఆగ్నేయుని అగ్నిజ్వాలలో ఈ దేహాన్ని ఎలాగా బలవంతాన మాడ్చటం...?

ఎక్కడైనా కాస్త శరీరానికి నిప్పుతగిల్తే ప్రాణం తల్లడిల్లిపోతుందే! సంపూర్ణంగా మండుతున్న మంటల్లోకి ఉరికి ప్రాణత్యాగం చేసుకోటం సాధారణమంటారా.........?

ఊ...ఁహుఁ అంతకంటే ప్రశాంతమైన గంగలోకి ఉరికి చనిపోవటం మేలుకదూ...?

అవును...స్నానం చేయటానికి ముంతెడు నీళ్ళు నెత్తిన పోసుకుంటే ఊపిరాడక తల్లడిల్లే ప్రాణాన్ని......నిండు జలంలో ముక్కు మూసుకొని దూకటం ఎలాగా ? అందులో దూకి భరించటం సాధ్యమౌతుందా......?

కాదు, దానికంటే సునాయాసంగా బారెడు దారంతో గొంతుక నొకేసారి నొక్కివేయుటం సులభసాధ్యం కదూ .....?

కాస్త తేలు కుట్టినపుడు ఏ బొటనవ్రేలికో విషమెక్కకుండా సన్నటిదారం కడితేనే జీవాలు పైకెగసి పోతాయి. అబ్బ! లావుపా దారంతో మెడకు ఉరివేసి, పైనుంచి వ్రేలాడితే గొంతుకను దారం నొక్కేటపుడు ఆబాధను తట్టుకోగలనా...?

ఎంతమాత్రం తట్టుకోలేను. అయితే...ఇంకా సులభంగా మరణించట మెలాగా......?

ఆ...కాస్త విషాన్ని క్షీరంలో కలిపి రెండు గుటకలు మ్రింగితే తీరిపోదూ ?

అవును. ఈలోకంనుండి విడిపోవటాని కింతకంటే సుసాధ్యమైన మార్గంలేదు. కాని విషం చేదుగావుంటుందే! అందులో తెలిసి, తెలిసి విపరీతమైన అసహ్యం పుట్టించే విషాన్ని మ్రింగగలనా...? వేపపుల్లతో పళ్ళుతోమితేనే ఆచేదును భరించలేనే! ఇక ఈ విషాన్ని ఎలాగో మ్రింగుతామనుకుంటే... అది కడుపులోకెళ్ళి గుండెల్ని అదిమి నానాబాధలుపెట్టి చంపుతుందే! అంత కఠోరమైన బాధలకు తట్టుకోంటానా?

ఎన్నడైనా కడుపునొప్పిందంటే తల్లడిల్లే ప్రాణాన్ని ఇన్నిబాధలకు గురిచేయగలనా... —?

అలాకాదు. ఈ నాలుగింటిలో మానవుడు మరణించటానికి సులభసాధ్యమైన మార్గంలేదు.

కాని.........తుపాకితో కాల్చుకుని ఒకే త్రుటిలో మరణించటం సులభమనుకుంటా.

అవును...... నా తుపాకి ఇంటిలోనే వుంది, అలాగే చేస్తాను...... ఈ తుపాకిలోనుండి వెలువడే గుండుదెబ్బకు తట్టుకోలేనా?

.........ఏమో చూద్దాం. తుపాకిని పేల్చుకుంటే ఎలావుంటుందో రోజూ చూట్టంలేదూ?

దెబ్బతిన్న పక్షులు, మృగాలూ......అబ్బ! ఆ ఇనుప గోళంనుండి గుండు వెలువడేటప్పుడే ఆ భయంకర శబ్దానికే గుండె గుభేలుమంటుందే! దెబ్బ తిన్న జీవం పదినిముషాల వరకూ యమయాతన ననుభవిస్తుంటే చూడటానికే సాధ్యంకాని నాకు అనుభవించటం.........

ఊఁ...హుఁ... ఇంతకంటే ఒకేసారి కత్తితో పొడుచుకొని చనిపోవటం మేలుగదూ......?

కాని ఆ వాడిగానున్న మొనను శరీరంలో దించి ప్రాణాల విడవటం......ఊఁ హుఁ. కాదు కాదు. ఎక్కడైనా కొస్త కత్తితో గీకితే యెంతో బాధపుట్టుతుందే! పూర్తిగా కత్తితో తెలిసి, తెలిసి పొడుచుకొనగల ధైర్యం ఎవరికుంది.

అయితే నేను చనిపోలేనా......? ఇంకేమీ సులభమార్గాల్లేవా!

ఎందుకు చావాలి? బలవంతంగా యమయాతన లనుభవిస్తూ మరణించి యెవర్ని సాధించటం...?

తొంభైఏళ్ళ ముసలి తొక్కుకూడా చనిపోవటమంటే భయపడ్తాడే! ఇంకా ఈ లోకంలో కష్టాలనుభవించటానికే ఉవ్విళ్ళూర్తాడే! మరి నేనెందుకు చనిపోవటం?

'ఎవరి ప్రాణం వారికి తీపి' అని పెద్దవారకే అన్నారా.........?


## మీ కేకాదు,
## మీ యింటికికూడా వికాసంవుండాలి!

ఆదర్శప్రాయమైన అధునాతన రచనలు, వ్యంగ్య చిత్రాలు, కథలు, కబుర్లు, తిమ్మన్న చురుకు విమర్శలు—యివియన్నీ మీ యింటికి వికాసం తెస్తాయి. ఇవిగాక మీ అందచందాలు తీర్చి దిద్దే—మీ ఆనందాన్ని యినుమడింపజేసే సౌందర్యార్చన, సినిమా మున్నగు కళలతో ప్రతి మాసమూ వెలువడే "చిత్రాంగి" ప్రతి యింటికీ అవసరం. ఇంటిల్లిపాదీ చదవడానికి ఆనందించడానికి రకరకాల రచనలు గల మాస పత్రిక "చిత్రాంగి." చిత్రాంగికి మీరు చందాదారులు అవండి. ఏడాది చందా రు. 3-8-0 మాత్రమే. నేడే వ్రాయండి.

**చిత్రాంగి** 39 ఆండర్సన్ వీధి మద్రాస్ 1.